

ఆచార్య వినోబా భావే, రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాల వేస్తున్న రాజేందర్‌రెడ్డి

మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని వినోబా మందిర ప్రాంగణంలో గురువారం భూదాన్ ఉద్యమ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వినోబా భావే, ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అహింసా పద్ధతిలో భూ పంపిణీ చేయడం ఒక విప్లవమని, ఈ మహోద్యమానికి నాంది పలికిన పోచంపల్లి గ్రామం జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రథమ భూదానంతో మొదలై దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలు దానంగా స్వీకరించారని పేర్కొన్నారు. ఆచార్య వినోబా భావే జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 11న భూదాన్ పోచంపల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నటుల తెలిపారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల గణేశ్, నాయకులు యానాల ప్రభాకర్‌రెడ్డి, గోనారెడ్డి, సారబాలయ్య, ఏలే భిక్షపతి, కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేశంగౌడ్, ఏపాల మురళి, కూరపాటి బాబు, కర్నాటి అంజమ్మ పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ధాన్యానికి గిట్టుబాటు ధర చెల్లించాలని వినతి

ఆలేరురూరల్, ఏప్రిల్ 18 : రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆలేరు మార్కెట్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన వసతులు కల్పించాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెక్క వెంకటేశ్, కొల్లూరి రాజయ్య, గ్యాదపాక కిష్టయ్య, ఆంజనేయులు, లక్ష్మి, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో హీమో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించిన డైరెక్టర్ వికాస్ భాటియా, పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

బీబీనగర్ ఎయిమ్స్‌లో హీమో డయాలసిస్ ప్రారంభం

బీబీనగర్, ఏప్రిల్ 18 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో హీమో డయాలసిస్ యూనిట్‌ను సంస్థ డైరెక్టర్ వికాస్ భాటియా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానకు వచ్చే రోగులకు డయాలసిస్ చేసేందుకు సరైన పరికరాలు లేక ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసే వాళ్లని, ప్రస్తుతం 5 హీమో డయాలసిస్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా గంటకు 250 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేసే ఆర్‌ఓ సిస్టమ్‌ను, ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముమ్ముందు వైద్య సేవలను విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, డాక్టర్లు కళ్యాణి, సూర్య, ధనలక్ష్మి, నెఫ్రాలజీ విభాగం డాక్టర్ అనిత, అసోసియేట్ ప్రొఫెసర్ శ్యామల పాల్గొన్నారు.

నేడు సీపీఐం అభ్యర్థి నామినేషన్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 18 : భువనగిరి పార్లమెంట్ స్థానానికి సీపీఎం అభ్యర్థిగా ఎండీ. జహంగీర్ శుక్రవారం నామిననేషన్ వేయనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. నామినేషన్ సందర్భంగా ఉదయం 10 గంటలకు స్థానిక రైల్వేస్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో సమావేశం నిర్వహిస్తామని, అనంతరం కలెక్టరేట్‌లో ఎండీ. జహంగీర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని తెలిపారు.



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ప్రజాప్రతినిధులు

దాతలకు సన్మానం

ఆత్మకూరు(ఎం),ఏప్రిల్18 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ ఉత్సవ పోషకులు మురారిశెట్టి కిషన్, జ్యోతి దంపతులను గురువారం ఆలయ కమిటీ చైర్మన్ గుండెగాని ఐలయ్యగౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, నగేశ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు దశరథగౌడ్, మల్లేశం గుప్తా, నేతాజీ యువజన మండలి మాజీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాజాపేట, ఏప్రిల్ 18 : మండలంలోని కాల్వపల్లికి చెందిన కాకల్ల చంద్రకళ విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ యువజన నాయకుడు ఇంజ నరేశ్ గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట కళ్లెం పాండు, ఇంజ శ్రీరాములు, నాగయ్య, శ్రీకాంత్, స్వామి, రామస్వామి, అంజయ్య, కార్తీక్ ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా నిత్యోత్సవాలు

- సీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం

సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం నిర్వహిస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, ఏప్రిల్18: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 13,89,412 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

రామలింగేశ్వరాలయంలో..

దేవస్థాన అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం సీతారామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగమండపంలో ఉదయం సీతారామ హనుమత్ మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్త పారాయణాలతో అభిషేకం, ఆధ్యాత్మరామాయణ పారాయణం, సీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శతనామార్చనలు చేశారు. అనంతరం శ్రీరాముడి పట్టాభిషేకం జరిపారు. సాయంత్రం సీతారామ,హనుమత్ మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పాలు జరిపారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ భాస్కర్ శర్మ, ఏఈఓ జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు చంద్రమౌళి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ రాజాపేట మండల స్థాయి సమావేశం

రాజాపేట, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని మీనాక్షి ఫంక్షన్‌హాల్లో శుక్రవారం నిర్వహించే బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశానికి ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పార్టీ మండల సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడి ఎన్నికతో పాటు, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో విజయవంతం చేయడంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బొమ్మలరామారం, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో నిర్మించిన బీరప్ప, మల్లన్న, ఆలయాల్లో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గొల్ల కురమ సంఘం మండల కన్వీనర్ గూదె బాలనర్సయ్య తెలిపారు. గురువారం ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట మల్లెబోయిన శ్రీనివాస్‌యాదవ్, గూదె బీరుమల్లయ్య, కర్నెకంటి రాజు, బైరబోయిన మల్లేశ్, బైసు రాజేశ్, రఘు యాదవ్ పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప ఆలయంలో ఉత్సవాలు

రాజాపేట, ఏప్రిల్ 18 : మండలంలోని దూదివెంకటాపురంలో గల బీరప్ప ఆలయంలో ఈ నెల 19 నుంచి 25 వరకు బీరప్ప కామరతీదేవి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న మందమాసం పూజలు, 20న బీరప్పస్వామికి మైల తీయడం, గద్దె బోనం, 21న సరుగు, బోనాలు, బీరప్పకథ, 22న స్వామివారి కల్యాణం, 23న కంసునికథ, చిల్లర వేశాలు, 24న నాగవెల్లికథ, మహంకాళి, బోగన్న, బీరప్ప, కామరతీదేవి వేశధారణలు, గొర్ల కల్యాణం, 25న గ్యారడీ వేశం, బయ్యన్న పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు పాలడుగు భాస్కర్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 18 : కేంద్రంలోని బీజేపీ సర్కారును గద్దె దించడం ద్వారా అవినీతి పాలనను అంతమొందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు భాస్కర్, కొండమడుగు నర్సింహ అన్నారు. గురువారం మండలంలోని పెంచికల్ పహాడ్, అనాజీపురం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె. వెంకటేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు ఏదునూరి మల్లేశం, కమిటీ సభ్యులు సిలువేరు ఎల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

వడపర్తిలో వైద్యశిబిరం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 18 : మండలంలోని వడపర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి సౌజన్యంతో మెడిసిటీ ఆస్పత్రి మేడ్చల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ టెస్టులతో పాటు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దస్తగిరి, రంజిత, రమ్య, సౌమ్య, భాగ్యశ్రీ, మార్కెటింగ్ ఇన్‌చార్జీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్టలో పోలీస్ కవాతు

యాదగిరిగుట్ట, ఏప్రిల్18: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి గాంధీబొమ్మ వరకు కవాతు సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐలు రమేశ్, వేణుగోపాల్, ఎస్ఐలు పాల్గొన్నారు.

రైతుల ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గానే కొనుగోలు చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి

మోత్కూరు, ఏప్రిల్ 18 : కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తాలు, పచ్చ గింజలు ఉన్నాయనే సాకుతో దానిని బీ గ్రేడ్ కింద కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి తెలిపారు. రైతుల ధాన్యాన్ని పూర్తిగా ఏ గ్రేడ్‌గానే కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తాలు సాకుతో ధాన్యాన్ని ఏ గ్రేడ్‌కు బదులుగా బీ గ్రేడ్‌గా కొనుగోలు చేస్తున్నారన్నారు. దాంతో పాటు 40 కిలోలకు బదులుగా రెండు కిలోలు అదనంగా తూకం వేస్తుండడంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు దొండ ఎల్లయ్య, యాదగిరి, మత్స్యగిరి, ముత్యాలు, లక్ష్మీరెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

భువనగిరి గురుకులంలో వార్షిక పరీక్షలు షురూ

- మొదటి రోజు 211 మంది గైర్హాజరు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 18 : భువనగిరి పట్టణంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. గురుకుల పాఠశాలలో ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థి మృతి చెందగా పలువురు అస్వస్థకు గురై చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో భయభ్రాంతులకు గురైన చాలా మంది విద్యార్థులు ఇండ్లకు వెళ్లారు. అయితే అందుబాటులో ఉన్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో పరిశుభ్రత, తాగునీటి వసతి, ఆహారాన్ని గురుకుల డిప్యూటీ జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి గురువారం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

విద్యార్థుల హాజరు ఇలా..

పాఠశాలలో 5 నుంచి 9 తరగతుల వరకు మొత్తం 376 మంది విద్యార్థులు ఉండగా గురువారం పరీక్షకు 165 మంది హాజరయ్యారు. 211 మంది గైర్హాజరయ్యారు. 5వ తరగతిలో 42 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. 6వ తరగతిలో 77 మందికి 20 మంది హాజరయ్యారు. 7వ తరగతిలో 76 మందికి 14 మంది, 8వ తరగతిలో 74 మందికి 24 మంది, 9వ తరగతిలో 77 మంది విద్యార్థులకు 65 మంది హాజరయ్యారు.

స్కూటీ అదుపుతప్పి టీచర్లకు గాయాలు

వలిగొండ, ఏప్రిల్18: స్కూటీ అదుపుతప్పి కింద పడడంతో ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు గాయపడిన ఘటన గురువారం మండలంలోని లోతుకుంట వద్ద చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లోతుకుంట గ్రామ పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు మహిళ ఉపాధ్యాయులు విధులు ముగించుకొని ఇంటికి స్కూటీపై బయల్దేరారు. మండలంలోని అర్రూరు గ్రామ పరిధిలోని వేదశ్రీ వెంచర్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయారు. దాంతో బద్దుల అనూష, గంటిపాక శైలజకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరు టీచర్లను మండల కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

ఘనంగా తెప్పోత్సవం

చౌటుప్పల్, ఏప్రిల్ 18 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణ మహోత్సం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాతం, తెప్పోత్సవం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, ధర్మకర్తలు పోలోజు శ్రీలతాశ్రీనివాస్‌చారి, కాంశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశ్, నర్సింహ పాల్గొన్నారు.

మేకల దొడ్డి దగ్ధం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 18 : మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి పుల్లయ్యకు చెందిన మేకల దొడ్డి గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లయ్య తనకున్న 50 మేకల కోసం గ్రామ శివారులో దొడ్డి ఏర్పాటు చేశాడు. గురువారం ఉదయం మేత కోసం మేకలను తోలుకుపోయాడు. తర్వాత దొడ్డికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకొన్నాయి. స్థానికుల సమాచారంతో ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. దొడ్డి పూర్తిగా దగ్ధం కావడంతో రూ.20వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మాక్ డ్రిల్‌ను తిలకిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

- జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్

చౌటుప్పల్, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం దివీస్ పరిశ్రమలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఉద్యోగులు ప్రదర్శించిన మాక్ డ్రిల్, అగ్నిమాపక సాధనాల వినియోగాన్ని తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఉద్యోగులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు సూచనలు చేశారు.

కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు జి.బాలకిశోర్, ఎన్.సాంబశివరావు, ఫైర్, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

22 నుంచి కూరెళ్లలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 18 : మండలంలోని కూరెళ్ల గ్రామంలో నిర్మించిన చండికాంభ సోమేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ఈనెల 22 నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను గ్రామంలో విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉప్పలయ్య, పాపయ్య, యాదగిరిరెడ్డి, రమేశ్, సత్యనారాయణ, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థుల మెస్‌ను పరిశీలిస్తున్న శాంతికుమార్

ప్రభుత్వ గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతికుమార్

మోత్కూరు, ఏప్రిల్ 18 : గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరులోని గురుకుల పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు. భువనగిరి గురుకులంలో అధికారుల అలసత్వం వల్లే ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థి మృతి చెందాడని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భువనగిరి గురుకులంలో మృతి చెందిన విద్యార్థి ప్రశాంత్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ వినయ్, రాంపాక చందు, శివ, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడి పెడితే.. రెట్టింపు డబ్బు ఇస్తామని మోసం

- లక్ష రూపాయలు పోగొట్టుకున్న మహిళ
- పోలీసులకు ఫిర్యాదు

రామన్నపేట, ఏప్రిల్18: తమ సంస్థలో డబ్బులు పెడితే రెట్టింపు ఇస్తామంటూ నమ్మించిన వ్యక్తి మహిళ నుంచి రూ. లక్షా నాలుగు వేలు కాజేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన గుండు రమాదేవి చేనేత కార్మికురాలు. ఈమెకు వెల్లంకి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. 2023 సెప్టెంబర్ 23న రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆమెకు వాట్సాప్ కాల్ వచ్చింది. తమ సంస్థలో పెట్టుబడి పెడితే కొద్ది రోజుల్లోనే డబ్బులు రెట్టింపు అవుతాయని చెప్పాడు. అతని మాటలు నమ్మిన రమాదేవి రూ.3వేలను అతను చెప్పిన నంబర్‌కు ఫోన్‌పే చేసింది. అతడి మాటలు నమ్మి మరో రెండు దఫాలుగా లక్షా నాలుగు వేల రూపాయలు ఫోన్‌పే చేసింది. ఆ తర్వాత అతడి నంబర్‌కు కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దాంతో తాను మోసపోయానని గ్రహించి తన బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం బాధితురాలు రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాశం భాస్కర్

గురుకుల విద్యార్థి ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే.!

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్ మృతి చెందడం విచారకరమని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని గురుకులాల్లో సమస్యలు పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి టూర్లకే పరిమిత మయ్యారని విమర్శించారు. ఇంత జరిగినా జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలను రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్ సందర్శించిన పాపాన పోలేదన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరుగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు . సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, రాష్ట్ర దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్, నాయకులు గంజి బసవలింగం, పట్నం కపిల్ , గుండ్ల రాజు యాదవ్, డబ్బికార్ సాహేశ్ కుమార్ పాల్గొన్నారు.